తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
14 నవంబర్ 2025
పేజీలు : 8
Follow :

# రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జాతీయ రహదారులు, ఆర్అండ్ బీ , పంచాయతీరాజ్ రోడ్ల మీద ప్రమాదాలు జరగకుండా భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పీ కె.నరసింహతో కలిసి జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా భద్రతా వైఫల్యం, రోడ్డు సరిగా లేకపోవడం వలన జరుగుతున్నాయని అన్నారు. మోపెడ్, పెద్ద వాహనాలు మాత్రమే ఎక్కువగా ప్రమాదానికి గురవుతున్నాయని, ఆర్అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులు వారం రోజులలో ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ జరుగుతున్నాయో గుర్తించి మరమ్మత్తులు చేయించాలని అన్నారు.గుంటలు ఉంటున్న చోట కాంక్రీట్ వేయించాలని, ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి రేడియం స్టిక్కర్లు, స్టడ్స్ లైట్స్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీ కమిషనర్లు వారికి సంబంధించిన అంతర్గత రోడ్డు తనిఖీ చేసి వర్షానికి పాడైపోయిన రోడ్లను మరమ్మత్తులు చేయించాలని అన్నారు.నేషనల్ హైవే అథారిటీ వారు నేషనల్ హైవేల మీద ప్రమాదాలు జరిగే చోట, సర్వీస్ రోడ్ల వెంట సూచిక బోర్డులు, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.జిల్లాలో నేషనల్ హైవేపై 22 చోట్ల ముందు జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ వారికి సూచించారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడటానికి పోలీస్ డిపార్ట్మెంట్ ఎల్లవేళలా పనిచేస్తుందని అన్నారు. 2025లో మరణాల రేటు 16 శాతానికి తగ్గించగలిగామని, ప్రస్తుతం 43 బ్లాక్ స్పాట్స్ గుర్తించి 43 విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు.ఇట్టి కమిటీ ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే పోలీసువారికి, 108 వాహనానికి సమాచారం అందించి ప్రజల ప్రాణాలను కాపాడతారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి మాధవి, డిపిఓ యాదగిరి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారులు, ఆర్అండ్ బి అధికారులు, నేషనల్ హైవే అధికారి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## హాలియాలో మైనర్ డ్రైవింగ్‌పై
# పోలీసుల ప్రత్యేక డ్రైవ్

**10 బైకులు సీజ్ - తల్లిదండ్రులకు కౌన్సెలింగ్**

**హాలియా, నవంబర్ 13 జనంసాక్షి**
నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు గురువారం హాలియా పట్టణంలో పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మైనర్లు నడుపుతున్న 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.అలాగే వాహనాలను పిల్లలకు ఇచ్చిన తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మోటార్ వెహికిల్స్ చట్టం ప్రకారం చలానాలు విధించారు.ఈ సందర్భంగా ఎస్సై సాయి ప్రశాంత్ మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, వారి భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.

## పరిమితికి మించి ప్రయాణీకులను
# తరలిస్తున్న ఆటోలు సీజ్

**ఎస్ఐ అజ్మీర రమేష్**




**కొండమల్లేపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రోడ్డు భద్రతా చర్యలలో భాగంగా ఎస్ఐ అజ్మీర రమేష్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పత్తికూళ్లకు వెళ్లే క్రమంలో పరిమితికి మించి ఆటోలలో పలు గ్రామాలకు వెళ్లడం జరుగుతుంది. దీనివల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం పట్టణ కేంద్రంలో ఎస్ఐ వాహనాల తనిఖీలలో భాగంగా పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళుతున్న ఆరు ఆటోలపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించామన్నారు. ప్రజల ప్రాణాలకు మించినవి ఏమీ లేవని చిన్న నిర్లక్ష్యం ప్రాణాల నష్టానికి దారి తీస్తుందని కూలీలను, పిల్లలను లేదా ప్రయాణికులను సామర్థ్యానికి మించి ఎక్కించడం ప్రమాదానికి కారణం అవుతుందన్నారు. అత్యాశతో నియమాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. తనిఖీలలో వాహన పత్రాలు, లైసెన్స్, ఇన్సూరెన్స్, ఎమిషన్ సర్టిఫికెట్లు కూడా పరిశీలించారు. పత్రాలు లేని వాహనదారు లకు హెచ్చరికలు జారీ చేసి, భద్రతా నియమాలను పాటించా లని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి ఆటోలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డు నియమాలను ఉల్లంఘించడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలకు కఠినంగా శిక్షిస్తామన్నారు.

# బీసీల ధర్మ పోరాట దీక్ష

**ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్**



**భువనగిరి, నవంబర్ 13(జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో, ప్రిన్స్ చౌరస్తా వద్ద,జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రం వద్ద ఉన్న బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేదాక బీసీ ల రిజర్వేషన్ ఉద్యమం ఆపేది లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పక్షాలను అవసరమైతే ఢిల్లీకి తీసుకెళ్తామని, అవసరమైతే ఢిల్లీలో పెద్ద ఎత్తున పోరాటంతో వేలాది బీసీలను తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి, తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేంతవరకు మన బీసీల పోరాటం ఆగొద్దని, దీక్షకు విచ్చేసిన బీసీ కుల సంఘాల నాయకులకు, వివిధ పార్టీల నుండి వచ్చిన బీసీ ప్రతినిధులకు ఆయన, ధైర్యం చెప్పారు. ఈ కార్య క్రమంలో , బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు గొట్టిపాముల బాబురావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఒవైస్ చిస్తీ, మాజీ ఎంపీపీ అధికం లక్ష్మీనారాయణ గౌడ్, బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులు మాటూరి అశోక్, కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, మిగతా 2లో

## ఆపదలో ఉన్న మిత్రునికి అండగా నిలిచిన
# పదవ తరగతి స్నేహితులు

**మర్రిగూడ, నవంబర్ 13 (జనంసాక్షి)**
ఆపదలో ఉన్న మిత్రునికి అండగా నిలిచి స్నేహ బంధాన్ని చాటుకున్న పదవ తరగతి స్నేహితులు, మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన తాటికొండ రమేష్ కుమారుడు మనీష్ గత కొద్ది కాలంగా బ్రెయిన్ సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని మెడికోవా ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్లో చేరి 60 రోజులుగా చికిత్స పొందుతున్నాడు, బ్రెయిన్ సర్జరీ కోసం 18 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి, అసలే నిరుపేద కుటుంబం కావడంతో దాతల ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న తాటికొండ రమేష్ కు శివన్నగూడ జిల్లా పరిషత్ పాఠశాల (2013-14) బ్యాచ్ చెందిన పదవ తరగతి స్నేహితులు 72,000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి మనీష్ కు ఆర్థిక సహాయం చేయాలని కోరారు.



# ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు

## అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడుపవద్దు : ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం



**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లాలో రోడ్డు ప్రమాదాలు సంభవించి ఒక్క ప్రాణం కూడా పోవద్దనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు గురువారం పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీగా ఉండే కొత్త బస్టాండ్ వద్ద సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు, పట్టణ పోలీసులు, పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు కళాబృందం వారు సాంస్కృతిక పాటల ద్వారా ప్రజలకు వివరించారు.రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద చనిపోతే కుటుంబం రోడ్డుపడుతుందని చైతన్య పరిచారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ రోజురోజుకు పట్టణంలో పెరుగుతున్న రద్దీకను గుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రమాదాలు సంభవించకుండా ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నామని తెలిపారు.ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ ముందుకు వెళ్లాలని కోరారు. అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడపవద్దని పేర్కొన్నారు.ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేయవద్దని, ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు.



## ప్రమాద బాధితునికి పరామర్శ

**కారేపల్లి, నవంబర్13(జనంసాక్షి) :**
కారేపల్లి మండలం చింతలపాడు గ్రామానికి చెందిన వాంకుడోత్ రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. అతనిని బీఆర్ఎస్ కారేపల్లి మండల మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ప్రధాన అనుచరుడు అజ్మీర వీరన్న గురువారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయన చింతలపాడు వెళ్లి రేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానికులు బాదావత్ అనిల్ ,వాంకుడోత్ పూర్ణ, ప్రశాంత్, సతీష్, హరిప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పీఠానికి కలశ పాత్రలు

**కారేపల్లి, నవంబర్13(జనంసాక్షి) :**
కారేపల్లి గంగమ్మతల్లి కమ్యూనిటీ హాల్ అయ్యప్ప పీఠానికి దాతలు కలశ పాత్రలను గురువారం అందజేశారు. ఓరుగంటి రాజు దంపతులు అయ్యప్ప పీఠంలో పూజలకు అవసరమైన ఐదు రాగి పాత్రలను పీఠం గురుస్వాములకు అందజేశారు. దాతలను గురుస్వాములు దీవించి తీర్థాప్రసాదాలు అందజేశారు. అయ్యప్ప దీక్షాదారులకు అల్పాహారాన్ని కారేపల్లికి చెందిన యర్ర సాయి అందజేశారు. ఈకార్యక్రమంలో పీఠం గురు స్వాములు పాలిక సారయ్య, గుగులోత్ రాందాస్, పాలిక శ్రీనివాస్, సంగు సాయి, కేతుమళ్ల శ్రీనివాస్, కనక వరప్రసాద్, దంతాల వెంకటేశ్వర్లు, పాలిక రమేష్, కట్ట రమేష్, ముక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





## విద్యార్థులకు టీషర్టు, ప్యాంట్లు వితరణ

### యూటీఎఫ్ నేత కృషితో దాతల సాయం

**కారేపల్లి, నవంబర్13(జనంసాక్షి) :**
కారేపల్లి మండలం గాదెపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో టీషర్టు, ప్యాంట్లు, ఐడీ కార్డులను గురువారం వితరణ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ నేత బానోత్ మంగీలాల్ మిత్రబృందం మను, తఅప్తేష్ షా, జయసుధల ఆర్థికసాయంతో విద్యార్థులకు డ్రస్‌లను కాంప్లెక్స్ హెచ్‌ఎం శారధ చేతుల మీదిగా విద్యార్థులకు అందదేశారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు నభ్యసిస్తారని వారు ఆర్థికంగా వెనబాటు ఉంటారే తప్ప, విజ్ఞానం, నైపుణ్యాలలో వెనకబాటు లేరని తలంచి దాతలు విద్యార్థులకు కావల్సి డ్రస్, ఐడి కార్డులను అందించారని యూటిఎఫ్ మండల కార్యదర్శి బానోత్ మంగీలాల్ తెలిపారు. ఇటివలే మిత్రులు కలిసి పాఠశాలకు మైక్, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవో దుగ్గిరాల జయరాజు, దాతలు మను, తఅప్తేష్ షా,జయసుధలతో పాటు దానికి కృషి చేసిన మంగీలాల్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు కేవీ. కఅష్ణారావు, ఎటుకూరి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు వేముల రాముర్తి, కేలోత్ సూర్యకుమార్, గడిపర్తి వీరభద్రరావు, భూక్యా రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు బీ.బిక్కు, జీ. కిషన్, మురళి, కృష్ణవేణి, సీఆర్‌పీ పరమేష్, అంగన్వాడీ టీచర్ రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ లేక మృత్యువాత పడుతున్న పశువులు

**చింతలపాలెం(జనంసాక్షి)**



సూర్యాపేట జిల్లా చింతలపాలెం గ్రామంలో గవర్నమెంట్ డాక్టర్ లేక పశువులు చనిపోతున్నాయి.రైతు అమరబోయిన వెంకయ్య 75000 గల పాడిపశు చనిపోవడం జరిగింది.గ్రామంలో ప్రభుత్వ డాక్టర్ లేకపోవడం వల్ల పశువులు అక్కడికక్కడే చికిత్స లేక మరణిస్తున్నాయి అనే సమస్య చాలా గ్రామాల్లో కనిపిస్తుంది. ఇది రైతులకు ఆర్థికంగా మరియు భావోద్వేగంగా పెద్ద నష్టాన్ని కలిగి స్తుంది.సమస్య కారణాలు ప్రభుత్వ వెటరినరీ డాక్టర్లు,ముఖ్యంగా గ్రామాల్లో, తక్కువ సంఖ్యలో ఉన్నారు.అవసరమైన మందులు,చికిత్స చేసేందుకు పరికరాల కొరత ఉంది.టెంపరరీ (తాత్కాలిక) వైద్యుల సంఖ్య కూడా తక్కువగా ఉంది,చాలాసార్లు రైతులు స్థానిక ప్రభుత్వాలను,అపేక్షిత అధికారులను పలు మార్లు అభ్యర్థన చేసినప్పటికీ స్పందన లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి డాక్టర్ల కొరత తీర్చాలని ప్రజలు కోరారు.

## బీసీల ధర్మ పోరాట దీక్ష



బిజెపి నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్ , బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి వెంకటేష్ గౌడ్, హరినాథ్ ,మల్లేష్ కుకుదువు కృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి జూకంటి రవి, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సబన్ కారు వెంకటేష్ , యాదగిరిగుట మండల అధ్యక్షుడు అశోక చారి,దళిత సంఘాల రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాదిగ, దేవేందర్ మాదిగ,శెట్టి బాలయ్య యాదవ్, అబ్బ గాని వెంకటేష్, పిట్టల బాలరాజ్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి ధర్పల్లి ప్రవీణ్ కుమార్, గుమడిలి రమేష్, శివకుమార్ రజక, గౌలికార్ కిషన్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు వేముల సత్యనారాయణ, దామోదర్, మేర సంఘం నాయకులు కీర్తి సత్యనారాయణ, దొనకొండ సత్యనారాయణ, తదితర బీసీ నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కోదాడ,( జనం సాక్షి):**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో సేవింగ్స్ ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బీమా పథకాలతో పాటు బ్యాంక్ తక్కువ ప్రీమియంతో అందించే భీమా ను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ నారాయణ నాయక్ అన్నారు. గురువారం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖమ్మం క్రాస్ రోడ్ శాఖ లో ఖాతా కలిగి ఉన్న గుండు రవి ఇటీవల మరణించడంతో బ్యాంకు భీమా ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల చెక్కును నామిని అయిన భార్య గుండు శిరీష కు చెక్కును అందించి మాట్లాడారు. కేవలం 350 రూపాయలతో సంవత్సరానికి 2 లక్షల రూపాయల జీవిత బీమా పథకం అందుబాటులో ఉందని సేవింగ్స్ ఖాతా ఉన్న ఖాతాదారులు 10 లక్షల రూపాయల వరకు తక్కువ ప్రీమియంతో భీమాను పొందగలగవచ్చునని ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

### జిల్లా కేంద్ర గ్రంథాలయం యాదాద్రి భువనగిరి

భువనగిరి, నవంబర్ 13(జనం సాక్షి)
58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు తేదీ. 14 -11-2025 నుండి తేదీ .20-11-2025 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులపాటు నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎండి. అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ ఎం .సుధీర్ తెలిపినారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ వారోత్సవాలలో నిర్వహించే కార్యక్రమాలలో ప్రతిరోజు ఒక కార్యక్రమం ఉంటుందని ఇందులో మొదటి రోజు.14-11-2025 న జాతీయ పతాకావిష్కరణతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపినారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలలో పుస్తక ప్రదర్శన. కవి సమ్మేళనం. ఉపన్యాస పోటీలు. వ్యాసరచన పోటీలు. క్విజ్ పోటీలు. మహిళా దినోత్సవం. నృత్య పోటీలు. నిర్వహిస్తామని తెలిపినారు. ఈ వారోత్సవాలలో భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు,పుర ప్రముఖులు, అధికారులు, అనధికారులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు మరియు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం మండల కేంద్రానికి చెందిన వద్ద్య శ్వేత నవీన్ దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వద్ద్య శ్వేత నవీన్ దంపతులకు అయ్యప్ప స్వాములు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వామి చిట్టెడి ప్రభాకర్ రెడ్డి, భూతరాజు సత్తయ్య, బూడిద శ్రీనివాస్ యాదవ్, గుమ్మడవల్లి జనార్ధన్, బోడ అశోక్ యాదవ్,బత్తుల జంగయ్య, బత్తుల విజయ్, బోడ నగేష్, కుంభం రవి, రెడ్డి మల్ల శ్రీను, ఇమ్మడి రమేష్, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

**జనంసాక్షి,కొండమల్లేపల్లి**

# భ్రూణహత్యలు మహా పాపం

## ఐసిడిఎస్ సూపర్వైజర్ పరిమి రజిని

**వేములపల్లి నవంబర్ 13 (జనంసాక్షి):**



భ్రూణహత్యలు మహా పాపమని భ్రూణహత్యలను నివారించవలసిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఐసిడిఎస్ వేములపల్లి సెక్టార్ సూపర్ వైజాగ్ పరిమిరజిని అన్నారు.ఐసిడిఎస్, దామర చర్ల ప్రాజెక్టు వేములపల్లి సెక్టార్ పరిధి లోని సల్కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని పాల్గొని మాట్లాడారు. కిశోర బాలబాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు బాల్య వివాహం చట్టారీత్యా నేరమని ఉల్లంఘిస్తే అందుకు శిక్షలు జరిమానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు అక్రమ దత్తత ,శిశువిక్రయాలు, భ్రూణహత్యలవల్ల కలిగే చట్ట పురమైన శిక్షల గురించి తెలియజేశారు. ఆపద సమయంలో పిల్లలకు అవసరమయ్యే హెల్ప్ లైన్లు 1098 ,100 పిల్లలకుతెలియజేయడం జరిగింది . గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పర్సనల్ హైజిన్ , పోషకాహారం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమా నాయక్ , ఉపాధ్యాయులు శేఖర్, జానయ్య సతీష్, మమత, అంగన్వాడీ టీచర్లు సంజాత ,జ్యోతి, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన

**డిఆర్డిఏ పి డి శేఖర్ రెడ్డి**

**మర్రిగూడ, నవంబర్ 13 (జనంసాక్షి)**



మర్రిగూడ మండలం కేంద్రంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం నల్గొండ జిల్లా డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా సిబ్బందికి రైతులకు కొన్ని సూచనలు చేస్తూ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల సీరియల్ రిజిస్టర్ లో తప్పకుండా నమోదు చేయాలి. ఒక బస్తా తూకం 40 కేజీల 750 గ్రాములుగా వేయాలని అలాగే హమాలీ 45 చెల్లించాలని తెలిపారు. రైతుల తెచ్చిన ధాన్యాన్ని కచ్చితంగా పాడి క్లీనర్ లో వేసి శుభ్రపరచిన తర్వాత వ్యవసాయ అధికారులు సర్టిఫైడ్ చేసిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. మండల మహిళా సమైక్య సభ్యులు దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారు రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, సి సి ఇందిరా, మండల సమైక్య అధ్యక్షురాలు పద్మ, కోశాధికారి అనూష తదితరులు పాల్గొన్నారు,



# కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలి

**కోదాడ,( జనం సాక్షి):**

కాకతీయ కమ్మ సంక్షేమ సంఘ కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలి అని సంఘ నాయకులు నలజాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలో కార్తీక మాసం వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ నిర్వహించి ఆయన మాట్లాడారు. కోదాడ మండలం దోరకుంట గ్రామ పరిధిలోని ఎర్నేని వెంకటరత్నం బాబు మామిడి తోటలో ఈనెల 16 ఆదివారం కార్తీక మాస వనభోజనాల సందర్భంగా ఉసిరి చెట్టు పూజలు వనభోజనాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ముత్తవరపు రామారావు, డాక్టర్ ఏటుకూరి రామారావు, సాతులూరి హనుమంతరావు, కర్రి సబ్బారావు, చిట్టిబాబు, పోటు కోటేశ్వరరావు, పెద్ది అంజయ్య , తదితరులు పాల్గొన్నారు.



# గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

**చింతలపాలెం (జనంసాక్షి)**

జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని,చింతలపాలెం మండల వ్యాప్తంగా పశువైద్య సిబ్బంది కొరత ఉన్నందున కోదాడ మరియు అనంతగిరి మండల పశువైద్య సిబ్బంది సహకారంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి చింతలపాలెం మండలంలోని దొండపాడు, గాంధీనగర్ తండ లో ఉన్న సుమారు 1200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనైనది.ఈ సందర్భంగా జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు,అలాగే నాటుకోళ్ళ పెంపకంలో పోషణ ఖర్చులు తగ్గించి, లాభదాయకంగా ఎలా ఉండాలో మెళకు వలు,రైతులకు సూచించారు.ఈ కార్యక్ర మంలో పశువైద్యులు డాక్టర్ భూక్యా మధు ,పశు వైద్య సిబ్బంది శేషగిరి,సాయి కృష్ణ ,చిరంజీవి, శ్రీను,శరత్,హుస్సేన్,ప్రసాద్ ,భాస్కర్,కరుణ్,సైదేశ్వర్ రావు,వీరారెడ్డి ,నాగుల్ మీర,రైతులు మల్లెల వెంకటరెడ్డి, మధిర సత్యనారాయణ రెడ్డి, సత్యం,వీర్రాజు ,సైదులు తదితరులు పాల్గొన్నారు.





## కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలను

# జయప్రదం చేయండి

## రాష్ట్ర కమిటీ సభ్యులు ఉయ్యాల నగేష్

ఆత్మకూరు ఎస్ **(జనంసాక్షి):**

ఈనెల 28 29 30 తేదీలలో సూర్యపేట జిల్లాలో జరిగే కల్లు గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలను జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉయ్యాల నగేష్ కోరారు. గురువారం మండలంలోని ఏపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957లో రాష్ట్రములో మొట్టమొదట ఏర్పడ్డ సంఘం కళ్ళు గీత కార్మిక సంఘం అని 68 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించిందని సొసైటీలు టిఎఫ్టిలు పెన్షన్ ఎక్స్గ్రేషియా లాంటి కొన్ని హక్కులు సాధించుకున్నామని అన్నారు. సంఘ%శీ% నిర్వహించే ప్రతి కార్యక్రమంలో నాటి నుండి నేటి వరకు మన సూర్యాపేట జిల్లాలోని అగ్రభాగాన ఉందని అమరులు ధర్మ బిక్షం ,తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, వర్ధిల్లి బుచ్చి రాములు లాంటి ఎందరో మహానుభావులు ఈ ప్రాంతం వారే కావడం మనకు గర్వకారణం అని వారిస్ఫూర్తితోనే నేడు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏఒక్క హామీని అమలు చేయలేదని అధికారులకు మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఇచ్చిన మాట ప్రకారం 4000 రూపాయలు పెన్షన్ 10 లక్షల ఎక్స్గ్రేషియా పెంచాలని ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్గ్రేషియ వెంటనే విడుదల చేయాలని నీరా మరియు తాటి ఈత ఉత్పత్తిలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షుడు బుడిగ లింగయ్య గౌడ్, గ్రామ మాజీ సర్పంచి రజిత సుధాకర్ , అబ్బగాని బిక్షం,జిల్లా కమిటి సభ్యులు మామిడి లింగయ్య గౌడ్,మండల కార్యదర్శి బెల్లం కొండ ఇస్తారి గౌడ్, మండల కమిటీ సభ్యులు బత్తిని మల్లయ్య, జలగం రాములుగౌడ్ ,జుజ్జూరి సైదులు గౌడ్,ఎరుకల సైదులు గౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థులు న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

## ఎండి. ఉమర్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి..

కోదాడ,( జనం సాక్షి):

బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మండల లీగల్ సర్వీస్ కమీటీ ఆధ్వర్యంలో కోదాడ తేజ టాలెంట్ స్కూల్ లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండి. ఉమర్ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే చట్టాల పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, మోటారు వాహన చట్టాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.నేటి విద్యార్థులే రేపటి పౌరులని,భారతదేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లో ఉందన్నారు. పిల్లలు మంచి క్రమ శిక్షణతో చదువులో ముందుంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ఇష్టపడి చదవాలన్నారు. నెహ్రూ,అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సిహెచ్. సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సోము నాయక్, న్యాయవాదులు దొడ్డా శ్రీధర్, మంద వెంకటేశ్వర్లు, సక్రాం, చిన్నాబ్బయ్, సిబ్బంది మౌనిక, పారాలీగల్ వాలంటీర్లు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సమైక్య రాష్ట్రంలో స్వరాష్ట్ర కాంక్షను ఏలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజి

## బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, తాటికొండ సీతయ్య

**తుంగతుర్తి నవంబర్ 13 (జనంసాక్షి)**
సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ధిక్కారాన్ని తన గొంతుతో ధ్వనింపచేసి స్వరాష్ట్ర కాంక్షను వెలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజి అని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో పార్టీ శ్రేణులతో కలిసి కాళోజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు కాళోజి నారాయణరావు అని అన్నారు.. సమాజంలోని అన్యాయాలకు అణచివేతలనే ఇతివృత్తంగా చేసుకొని తన రచనలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పరితపించిన అక్షర



తపస్వి కాళోజి నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగానీ రాములు గౌడ్, గోపగాని శ్రీనివాస్, కోదాడ మాజీ కౌన్సిలర్ లలిత, రమేష్, వెంకన్న, తడకమల్ల రవికుమార్, వెంకటేష్, మహేందర్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పేరుకపోయిన ప్రజా సమస్యలను పరిష్కరించాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ

**భువనగిరి, నవంబర్ 13(జనంసాక్షి)**
గత 20 నెలలుగా గ్రామాలలో సర్పంచ్, పాలకమండలి లేకపోవడంతో అనేక సమస్యలు పేరుకుపోయి వాటిని పరిష్కరించే నాథుడే లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వము గ్రామాలు నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తగిన నిధులు కేటాయించి పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం, చీమలకొండూరు గ్రామాలలో సిపిఎం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల పాలకమండలిలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు మాత్రం పరిష్కారము కావడం లేదని అన్నారు. గ్రామాలలో ప్రధానంగా మురికి కాలువలు, వీదిలైట్లు, రోడ్లు లాంటి మౌలిక వసతులు కూడా పరిష్కారం చేసే పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు లేరని అన్నారు. కార్యదర్శులను సమస్యలు పరిష్కారం చేయమంటే డబ్బులు లేవని చెప్పడం తప్ప పనులు చేసే పరిస్థితులలో వారు లేరని తెలిపారు. ప్రభుత్వము అనేక వాగ్దానాలు ప్రజలకు ఇచ్చిన వాటిని అమలు చేసేకాడ విఫలమైందని విమర్శించారు. ఇంకా గ్రామాలలో ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్స్ లాంటి సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇస్తానన్న ఫ్రీ కరెంటు కూడా అందరికీ అందడం లేదని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా గ్రామంలో ప్రజలు ఎవరికి చెప్పాలనో తెలియడం లేదని అన్నారు. ప్రత్యేక పరిపాలన అధికారులు మూడు నెలలైనా గ్రామాలను పర్యటించే పరిస్థితి లేదని సమస్యలను తెలుసుకునే పరిస్థితి లేదని, వాటిని పరిష్కరించే పరిస్థితి లేదని విమర్శించారు. ఇప్పటికైనా వెంటనే ఎన్నికలు నిర్వహించి తగిన నిధులు కేటాయించి గ్రామాల్లో పేరుకపోయినా మౌలిక సమస్యలను పరిష్కరించాలని నర్సింహ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే ఆధారంగా వచ్చిన సమస్యలపై రానున్న కాలంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య , మాజీ మండల కార్యదర్శి డా" బొల్లెపల్లి కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి మల్లేశం, మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్ , కొండపురం యాదగిరి , అనాజిపురం శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ , చీమల కొండూరు శాఖ కార్యదర్శి బోడ ఆంజనేయులు, ఆయా గ్రామాలకు సంబంధించిన పార్టీ సభ్యులు బొల్లెపల్లి స్వామి, వెంకటస్వామి, బొల్లెపల్లి పరమేష్ , గంగాదరి బాన్ ప్రకాష్, నోముల జ్యోతి, రాగుల కిష్టయ్య, రాగిరి మల్లయ్య, పల్లెర్ల లాలయ్య, ములుగు రాములు, ముత్తమ్మ, మాతమ్మ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి విద్యార్థి గొప్ప లక్ష్యం పెట్టుకుని తమలో ఉన్న స్కిల్స్ మెరుగు పరుచుకోవాలి

## ఇంపాక్ట్ ట్రైనర్స్.పోలిశెట్టి శ్రీధర్, వీరవెల్లి శ్రీలత

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనీ "ఇంపాక్ట్ ట్రైనర్స్"అవగాహన కార్యక్రమం కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఆధ్వర్యంలో "ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్స్" వీరవెల్లి శ్రీలత(బాలిక సాధికారత),పోలిశెట్టి శ్రీధర్ (వ్యక్తిత్వ వికాసం)లు విద్యార్థులకు అవగాహన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆధునిక పోటీ ప్రపంచంలో పట్టుదలతో ప్రతి విద్యార్థి గొప్ప లక్ష్యం పెట్టుకుని తమలో ఉన్న స్కిల్స్ మెరుగుపరుచుకుంటూ వచ్చిన ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలని, ఏ లక్ష్యాన్ని ఏపర్చుకున్నారో ఎవరికి వారు %ాబొూ% ఎనాలసిస్ చేసుకోవాలని, అవరోధాలు అధిగమిస్తూ, సమయాన్ని సద్వినియోగ పరుచుకుంటూ కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ,లక్ష్యం దిశగా ప్రతి అడుగు ప్రధానమైనదని అడుగు ముందుకు వేస్తూ లక్ష్యాలు చేరుకోవాలన్నారు,దేశ భవిష్యత్తు విద్యార్థుల మీదే ఆధారపడి ఉంది శీతల్ దేవి, కల్పనాచావ్లా సెక్స్ స్టోరీలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ట్రైనర్స్ ని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.





## న్యాయవాది పై జరిగిన దాడిని

# తీవ్రంగా ఖండిస్తున్నాం..

**మణుగూరు,నవంబర్13 (జనంసాక్షి):**
నిర్మల్ లో న్యాయవాది పై జరిగిన పోలీస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం.శ్రీనివాసరెడ్డి అన్నారు.గురువారం మణుగూరు కోర్టులో విధులను బహిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిన్న నిర్మల్ జిల్లా నిర్మల్ కోర్టు నందు జరిగిన దుర్ఘటన న్యాయవాది వాహనంపై పోలీసుల తీరు హేయనియమని ,కక్షిధారుని కోర్టులో ప్రవేశపెట్టే తన వృత్తి ధర్మంలో విధులను ఆటంక పరిచి,యూనిఫాం ను తీసుకొని న్యాయవాది వాహనాన్ని ధ్వంసం చేసి, భయానక వాతావరణం సృష్టించి, చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే, దురుసుగా ప్రవర్తించి, పోలీసులను ప్రశ్నించిన న్యాయవాదిని తీవ్రంగా అవమానపరిచిన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా మణుగూరు బార్ అసోసియేషన్ తరుపున సంఘీభావం తెలిపారు. న్యాయవాది పి. అనిల్ కు జరిగిన అన్యాయానికి నేడు కోర్టు విధుల నుండి దూరంగా ఉంటూ, మణుగూరు బార్ అసోసియేషన్, న్యాయవాదులు,నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, న్యాయవాదులు,మహిళా న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు మండల కన్వీనర్ గా నీల రామ్మూర్తి

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
సిఐటియు మండల కన్వీనర్ గా నీల రామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కార్మిక సోదరులకు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు కార్మికుల నాపై ఉంచిన నమ్మకాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నేరేడుచర్ల మండలంలో కార్మికుల ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కొరకు సిఐటియు సంఘం తరపున పోరాడుతానని కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారం కొరకు పాటుపడతానని అన్నారు. కార్మికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# మండల పంచాయతి అధికారిగా ఇరుగంటి నాగరాజు

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
మండల పంచాయతి అధికారిగా ఇరుగంటి నాగరాజు మండల పంచాయతీ అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం వెలువరించిన గ్రూప్ 02 ఫలితాల్లో భాగంగా నేరేడుచర్ల మండల పంచాయతీ అధికారిగా పోస్టింగ్ ఇవ్వడం జరిగింది.ఇక్కడ మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించిన హరి సింగ్ నాయక్ అనంతగిరి మండలం ఎంపీడీవో గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



# నూతన ఎంపీఓ గా ప్రియాంక

**ఆత్మకూరు ఎస్ (జనంసాక్షి) :**
స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఎంపీవోగా ముత్య%శీ% ప్రియాంక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హసిం ,ఏపీవో ఈశ్వర్ , కార్యాలయ సిబ్బంది సూర్యప్రకాష్, హసన్ హాలీ, అజ్మీర్ స్వామి, వీరసింగ్ ప్రసాద్,, బిక్షం విజయ్ కుమార్, గౌతమ్, జ్యోతి పాల్గొన్నారు.



# త్రివేణిలో కన్నుల విందుగా వార్షిక క్రీడా సంబరం

**ఖమ్మం, (జనంసాక్షి):**
బాలల దినోత్సవ సందర్భంగా ఖమ్మం త్రివేణి ప్రైమరీలో వార్షిక క్రీడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ క్రీడాంశాలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమం ప్రారంభంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ విద్యార్థులను, అతిధులను అలరించింది. ఈ క్రీడా ఉత్సవ కార్యక్రమానికి అతిథులుగా ఖమ్మం నగరంలోని గురుదత్త నేత్రాలయ కు చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఎం నందనందన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి అత్యంత తోడ్పాటును అందిస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి పాల్గొని విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, సిబ్బంది పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించారు.









# టీఆర్పీ బలోపేతానికి కృషి

**సూర్యాపేట(జనంసాక్షి):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మీర్ అక్బర్ నియమితులయ్యారు. ఈ మేరకు టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు, తమ నియామకానికి సహకరించిన టిఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంఛార్జ్ వట్టె జానయ్య యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో టిఆర్పీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

### కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను

# జయప్రదం చేయండి

**సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పట్టణ కార్యదర్శి పగడాల శివ**



**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి):**
సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభ పోస్టర్లను గురువారం పట్టణ కేంద్రంలో పార్టీ పట్టణ కార్యదర్శి పగడాల శివ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవోద్యమ అగ్రనాయకుడైన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి దున్నేవారికే భూమి అనే నినాదంతో రైతాంగ, ఆదివాసీ పోరాటాలకు నేతృత్వం వహించారని, ఆ పోరాటాల ఫలితంగా వేలాది ఎకరాల భూములు ప్రజల చేతుల్లోకి వచ్చాయని అన్నారు. భూపోరాటాల నిర్మాణం నేటి అత్యవసర కర్తవ్యం అని, పాలక వర్గ పార్టీలు అమలు చేస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ఎదుర్కొంటూ అమరవీరుల ఆశయాల సాధన కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతగల్ల నర్సింహా, గోరుగంటి ముత్యాలు, కొత్త బాబు యాదవ్, బొడ్డు కిషన్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడి బిల్డింగును పరిశీలించిన అధికారులు

**చింతలపాలెం (జనంసాక్షి)**
దొండపాడు గ్రామపంచాయతీ పరిధిలో హైస్కూల్ యందు నిర్మాణం అవుతున్న అంగన్వాడి బిల్డింగ్స్ సెంటర్ ను మరియు హై స్కూల్ నందు మిడ్ డే మీల్స్ పథకమును పరిశీలించిన ఎంపీడీవో రాంచందర్ రావు,ఎంపీఓ భూపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్తిరెడ్డి ,పంచాయతీ కార్యదర్శి సైదులు మరియు ఇతరులు పాల్గొన్నారు.






# గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల నిరసన

- ○పండిట్స్,పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేయాలి
- ○ సిఆర్టిలను,డైలీ వేజెస్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి
- ○ టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్

**టేకులపల్లి,నవంబర్ 13(జనంసాక్షి):**
గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న పండిట్స్,పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, సిఆర్టిలను,డైలీ వేజెస్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని,అప్పటివరకు వారికి మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) టేకులపల్లి మండల కమిటి ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల కోయగూడెంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిఆర్టిలు మరియు డైలీ వేజెస్ వర్కర్లు ఫ్లెక్సీ,కరపత్రాలు,ప్లకార్డులు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ గురువారం నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ యాజమాన్యంలో కూడా పండిట్,పీఈటి పోస్టులు లేవని,అన్ని యాజమాన్యా లలోని పండిట్స్,పిఈటి పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేసి పదోన్నతులు ఇచ్చారని, కేవలం గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో మాత్రమే పండిట్,పిఈటి పోస్టులు కొనసాగుతున్నాయని, వెంటనే వాటిని అప్గ్రేడ్ చేసి వారికి పదోన్నతులు ఇవ్వాలని,గత 25 సంవత్సరా లుగా గిరిజనసంక్షేమ శాఖలో సిఆర్టిలు అతితక్కువ వేతనంతో పనిచేస్తూ జీవితాన్ని గిరిజన సంక్షేమ శాఖకు అంకితం చేశారని,ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని,అప్పటివరకు వారికి మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని,30 సంవత్సరాలుగా డైలీ వేజెస్ వర్కర్లు చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి వేతనాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని,అటువంటి ప్రయత్నాలను విరమించు కొని వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని,విద్యాశాఖలో మాదిరిగానే గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పాటర్న్ ప్రకారం రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలని, అన్ని వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేసి పదవ తరగతి వరకు ఉన్నతీకరించా లని,అన్ని ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా,సెక్షన్ల ఆధారంగా పోస్టులను మంజూరు చేయాలని, అన్ని ప్రాథమిక పాఠశాలలకు పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని,317 జీవో అప్పీల్స్ అన్నింటిని పరిశీలించి,పరిష్కరించి వారికి న్యాయం చేయాలని,జీవో 317 బాధిత ఉపాధ్యాయులకు కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో డిప్యూటేషన్ అవకాశాలు కల్పించాలని,గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు,ఉద్యోగులకు కామన్ సర్వీస్ రూల్స్ ను రూపొందించి గ్రేడ్ వన్ హెచ్డబ్ల్యూఓ ,ఏటిడిఓ,డిటిడిఓ,డిడిలుగా ప్రమోషన్ల లో అవకాశం కల్పించాలని,అన్ని జిల్లాలలో ఒకే విధమైన పరిపాలన,పర్యవేక్షణ, అకాడమిక్ విధానం అమలు చేయాలని,గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలకు,ఆశ్రమ ఉన్నత పాఠశాలకు సర్వీస్ పర్సన్లను నియమించాలని, అన్ని ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలని,జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల వలె అన్ని ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేయాలని,సిఆర్టిలకు,డైలీ వేజెస్ వర్కర్లకు ప్రతినెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలని,డైట్ బిల్లులు ఏ నెలకానెల విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 24వ తేదీన ఐటీడీఏ భద్రాచలం ఎదుట,డిసెంబర్ 12వ తేదీన గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం హైదరాబాదు ఎదుట నిరసన ప్రదర్శన కలదని అన్నారు. ఈ భవిష్యత్ పోరాట కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, సిఆర్టిలు, డైలీ వేజెస్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో టేకులపల్లి మండల కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు,ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.అమర్ సింగ్,బి.కిషోర్ సింగ్, ఈ.పి.రాజు, బాలరాజు, సైదులు,తారాబాయి,హేము, రాంబాబు, మంగమ్మ, లక్ష్మీనారాయణ, జి.రవికుమార్,భద్రు,బుచ్చయ్య,సునీత డైలీ వేజెస్ వర్కర్లు నాగులు, వెంకట్రాం, ఎర్రమ్మ, ధనమ్మ,బాలమ్మ,రాధ పాల్గొన్నారు.

# బిసిల స్మశాన వాటికకు స్థలం కెటాయించాలి

## తహాశీల్దార్ రాంప్రసాద్ కు బిసీ కులాల నాయకుల వినతి



**ఖమ్మం రూరల్, నవంబర్ 13 (జనంసాక్షి)**
తర తరాలుగా వారసత్వంగా కొనసాగుతునన్న బిసీల స్మశాన వాటిక స్థలాన్ని వేరొక సామాజిక వర్గం వారు తమదేనని వాదిస్తూ బిసీలకు అన్యాయం చేస్తున్నారని రెవిన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సాంప్రదాయాన్ని కొనసాగించుకునేలా న్యాయం చేయాలని మండల పరిధిలోని ఎం.వెంకటాయాపాలెం గ్రామానికి చెందిన పలు బీసీ కుల సంఘాల నాయకులు తహాశీల్దారు రాంప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. గురువారం మండల రెవిన్యూ కార్యాలయంలో ఖమ్మం రూరల్ తహాశీల్దార్ రాంప్రసాద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎం. వెంకటాయపాలెం గ్రామం శివారులో గ్రామానికి చెందిన చాకలి, పద్మశాలి, ముదిరాజ్, కుమ్మరి, గౌడ, మంగలి, కంసలి, యాదవ తదితర బీసీ కులాల ప్రజలు గ్రామ శివారులోని స్థలాన్ని స్మశానవాటికకు వినియోగించుకున్నామని, అక్కడ కొంత స్థలంలో విధ్యుత్ సబ్ స్టేషన్ ను నిర్మంచారని ఆ ప్రక్కను గ్రామంలోని మరో సామాజిక వర్గానికి చెందిన వారిది స్మశానవాటిక ఉందన్నారు. ఐతే అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని మొత్తం సర్వే చేసి వందల ఏండ్ల నుండి కొనసాగుతున్న విధంగానే తమ కులాలకు స్మశాన వాటికకు స్థలం కెటాయించాలని వారు తహాశీల్దారు కోరారు. తహాశీల్దార్కు వినతి పత్రం ఇచ్చిన వారిలో వివిధ బిసీ కులాలకు చెందిన మునిగంటి వెంకన్న, నేరెళ్ల నాగేశ్వరరావు, దేవరకొండ ఉపేందర్, మునిగంటి నర్సింహారావు, ఉపేందర్, కుర్రా వెంకన్న, బాల్నె యాదగిరి, తోకల పెద్ద వెంకన్న, నిధిగొండ బిక్షం, నిదిగొండ వెంకటేశ్వర్లు, రామగిరి నాగరాజు, గుండాల సమ్మయ్య , పడిగల నాగేశ్వరరావు, మునిగంటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



# చర్ల మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**చర్ల జనంసాక్షి :**
గురువారం చర్ల మండలం లో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటించారు పలు పోడు సమస్యల మీద, మరియు ఇందిరమ్మ ఇంటి సమస్యల మీద ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పోడు సాగులో వున్నా గిరిజనలకు న్యాయం జరిగేలా చేస్తానని పై అధికారులతో మాట్లాడి ఈ సమస్యని ఒక కొలిక్కి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. అప్పటివరకు ఎలాంటి తవ్వకాలు జరుపుకుండా తక్షణమే పోడు భూముల్లో ఉన్న జెసిబిలను వెనక్కి తిప్పి పంపారు. అనంతరం బిఎస్ రామయ్య నగర్ లో ఇందిరమ్మ ఇల్లాలు కొట్టు కోవడానికి స్థలం ఫారెస్ట్ అధికారులుది అని ఇల్లులు కట్టకుండా అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరించరూ. ఇందిరమ్మ పట్ట వచ్చిన ప్రతి ఒక్కరు ఇల్లు కట్టుకోవాలని బిఎస్ రామయ్య నగర్ గ్రామ ప్రజలను కోరారు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరికీ ఇల్లు వస్తాయని ఈ సందర్భంగా మాట్లాడారు ప్రతి ఒక్కరికి ఇల్లు వస్తుందని చెప్పారు రానివారు ఎటువంటి అపోహలకు లోను కాకూడదని ఆయన అన్నారు.

# రేపు విఎం బంజర్ హైస్కూల్లో జిల్లా స్థాయి బాలుర ఖోఖో క్రీడాపోటీలు

## జిల్లాస్థాయి క్రీడలకు ఆతిధ్యం ఇస్తున్న విఎం బంజర్ హైస్కూల్



**పెనుబల్లి, నవంబర్ 13(జనంసాక్షి)**
ఖమ్మం జిల్లా స్థాయి బాలుర ఖోఖో క్రీడా టోర్నమెంట్ ఈనెల 15 ఒక్కరోజు పెనుబల్లి మండలం విఎం బంజర్ పీఎం జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ ఆవరణంలో నిర్వహించటం జరుగుతుందని ఎంఈఓ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్య నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బండి రాము తెలిపారు, జిల్లాస్థాయి పాఠశాలల క్రీడల్లో భాగంగా 17 సంవత్సరాల వయసుగల బాలురకు నిర్వహీంచే ఖోఖో క్రీడలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందనితెలిపారు. ఖమ్మం జిల్లా లోని 22 మండలాలకు సంబంధించిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు, ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొనే విద్యార్థు లకు, వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడా అభిమానులకు వి ఎం బంజర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అధ్యా పకులు, అధ్యాపకేతర సిబ్బంది,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సాధారంగా స్వాగతం పలుకుతున్నట్లు తెలియజేశారు.



# పసుమర్తిరాంబాబును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

**కల్లూరు నవంబర్ 13 (జనంసాక్షి)**
కల్లూరు పట్టణ ఆర్యవైశ్య మాజీ అధ్యక్షులు , ప్రముఖ వ్యాపారవేత్త పసుమర్తి రాంబాబు మాతృమూర్తి సుభద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.. పార్టీ శ్రేణుల ద్వారా విషయం తెలుసుకున్న బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర. నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గురువారం రాంబాబు నివాస గృహం కెళ్ళి పరామర్శించారు. స్వర్గీయ సుభద్రమ్మ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు పసుమర్తి రాంబాబు, సోదరుడు శ్రీనివాసరావులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్కినేని రఘు, పేడకంటి రామకృష్ణ, పెద్దబోయిన మల్లేశ్వరరావు, మేకల కృష్ణ, , చారుగుండ్ల సందీప్ కట్ట అర్లప్ప బానోత్ కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ ఎగ్జాస్టింగ్ గ్యాస్ సిలిండర్ ఉపయోగించే విధానం పై అవగాహన కల్పించిన ఫైర్ సిబ్బంది

**పినపాక, నవంబర్13(జనం సాక్షి):**
ఫైర్ ఎగ్జాస్టింగ్ గ్యాస్ సిలిండర్ ఆపద సమయంలో ఉపయోగించే విధానంపై పినపాక ఫైర్ స్టేషన్ సిబ్బంది గురువారం షాపు యజమానులకు అవగాహన కల్పించారు.పినపాక ఫైర్ స్టేషన్ ఎస్ఐ పి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఫైర్ ఎగ్జాస్టింగ్ గ్యాస్ సిలిండర్లు అనేవి అగ్నిని త్వరగా సమర్థవంతంగా ఆర్పివేయడానికి ఉపయోగించే ప్రత్యేక పరికరాలు అని తెలిపారు. ఇవి నీటి తో ఆర్పే వాటి కంటే భిన్నంగా పనిచేస్తాయని , ప్రత్యేకించి సున్నితమైన ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా దహనశీల ద్రవాలు పెట్రోల్,డీజిల్ పంపులు, ఉన్న ప్రదేశాలలో మంటలు చెలరేగినప్పుడు వాటిని ఆర్పడానికి ఉపయోగపడతాయి అని అన్నారు. ఈ సందర్భంగా పలువురికి ప్రత్యక్షంగా ఫైర్ ఎగ్జాస్టింగ్ గ్యాస్ సిలిండర్ ని అగ్ని సంభవించినప్పుడు ఎలా ఉపయోగించాలో ప్రత్యక్షంగా చూపెట్టారు.ఈ కార్యక్రమంలో పినపాక ఫైర్ స్టేషన్ సిబ్బంది,ఎల్ ఎఫ్ భాస్కర్, ఫైర్ మెన్ ఎన్ అజయ్ కుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# మహాకవి కాలోజీ కి ఘనమైన నివాళులర్పించిన కమల్ రాజు



**మధిర, నవంబర్ 13 (జనంసాక్షి)**
మహాకవి కాలోజి నారాయణరావు వర్ధంతి సందర్భంగా మధిర బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ మధిర నియోజకవర్గం ఇంచార్జ్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కాలోజి పాత్ర ఎంతో ఉందని అందుకే కాలేజీ జయంతి సందర్భంగా రాష్ట్ర భాషా దినోత్సవం గా ప్రకటించి కాళోజి గారిని గౌరవించుకున్నాం. తెలంగాణ రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజల కోసం ఆయన కవితలు స్ఫూర్తిని పొందినయని ఆయన కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు పట్టణ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి మాజీ కౌన్సిలర్ వైవిఅప్పారావు ముత్తవరపు ప్యారి ఎస్టీ ఇక్బాల్ ఆళ్ల నాగబాబు మాజీ సర్పంచ్ బొగ్గుల వీరారెడ్డి బోనకల్ మండల నాయకులు గంగవరపు రామకృష్ణ కపిలవాయి జగన్ వేల్పుల శివ రమేషు చీదిరాలా రాంబాబు అక్బర్ లంకె మల్ల నాగేశ్వరరావు ఆవుల గోపి దిల్ వంగవీటి చాపల సొసైటీ ప్రెసిడెంట్ దర్శి నాగేశ్వరరావు షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి వాలిబాల్ పోటిల్లో మూడవస్థానం సాధించిన మండల టీం

**పెనుబల్లి, నవంబర్ 13 (జనంసాక్షి)**
ఖమ్మం జిల్లామధిరలో గురువారం జరిగిన జిల్లా పాఠశాలల స్థాయి వాలీబాల్ క్రీడాపోటిల్లో 17 సంవత్సరాల బాలుర విభాగంలో పెనుబల్లి మండలం టీ%శీ% మూడవ స్థానం సాధించడం జరిగి%శీ%ది, ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎస్ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి రాము గెలుపొందిన మండల టీం ని అభినందించటం జరిగినది.



# రాయపట్నం గ్రామంలో మంటలతో చిల్లర కొట్టు దగ్ధం

## అర్ధరాత్రి ఒక్కసారిగా బడ్డీ కొట్లో చల్లరేగిన మంటలు

**మధిర, నవంబర్ 13 (జనంసాక్షి):**
మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల దగ్గర్లో ఉన్న చిల్లర కొట్టు మంటల్లో దగ్ధమైంది. రాయపట్నానికి చెందిన సాధులూరి ఇశ్రాయేలు అనే వ్యక్తి ఆరోగ్యం సరిగా లేనందున చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో గత రాత్రి బడ్డి కొట్టు బంద్ చేసి ఇంటికెళ్లిన సమయంలో కొట్టు లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలియజేస్తున్నారు. జీవనోపాధి కోసం చిల్లర వ్యాపారం నిర్వహిస్తుండగా ఇలా మంటలు వడ్డీ కొట్టి తగలబడటంతో చేసేదేమీ లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తనకు జరిగిన నష్టానికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ఎంతోకొంత అందించాలని ప్రాధేయ పడుతున్నాడు బాధితులు ఇశ్రాయేలు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం లేదు.

# గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే టీసిఏ ప్రధాన లక్ష్యం

## ○తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గోల్డ్ కప్ టోర్నమెంట్

## ○టి సి ఏ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ప్రదీప్ కుమార్, వీరేష్ గౌడ్

**ఖమ్మం బ్యూరో నవంబర్ 13, (జనంసాక్షి):** తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ కు ముందస్తుగా ఐదు జోన్లలో ఒక్కో జోన్ నుంచి ఐదు జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 18వ తేదీ నుంచి ఆయా జోన్లలో ఓపెన్ సెలక్షన్స్ జరుగుతాయని టిసిఏ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, వీరేష్ గౌడ్ తెలిపారు. గురువారం ఖమ్మం లోని సీక్వెల్ రిసార్ట్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈస్ట్ జోన్ పరిధిలోకి వచ్చే ఖమ్మం, భద్రాది కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ, మహబూబాబాద్, వరంగల్, భూపాల్ పల్లి, ములుగు, పరకాల, హనుమకొండ, స్టేషన్ ఘన్పూర్ జిల్లాల నుండి ఆరు క్రికెట్ జట్లను సెలక్షన్ చేసి ఫైనల్ టోర్నమెంట్ కు పంపిస్తామన్నారు. నవంబర్ 18 వ తేదీ నుంచి ఖమ్మం జిల్లా వేపకుంట్ల గ్రామంలోని ఎస్ ఎస్ క్రికెట్ గ్రౌండ్ లో ఉదయం 9 గంటల నుండి ఓపెన్ సెలక్షన్ నిర్వహిస్తామని వారు తెలిపారు. క్రికెట్ పోటీల్లో సెలక్షన్ కు వచ్చే అభ్యర్థులు తమ డేటాఫ్ బర్త్ తో ఉన్న ఆధార్ కార్డు గాని పుట్టిన తేదీని ధ్రువీకరించే పాన్ కార్డు, పదో తరగతి మెమో, ఏదో ఒకటి తీసుకొని రావాలని డాక్టర్ ప్రదీప్ కుమార్ కోరారు. తెలంగాణ గోల్డ్ కప్ కు సంబంధించి ఫైనల్ షెడ్యూల్ నవంబర్ చివరి వారంలో విడుదల చేస్తామని డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్ జోన్లు కలుపుకొని మొత్తం ఐదు జోన్ల నుంచి ఒక్కోజోన్ తరఫున ఆరు జట్లను ఎంపిక చేసి మొత్తం 30 జట్లతో కలిపి గోల్డ్ కప్ టోర్నమెంటుకు ఆడేలా ఎంపిక చేస్తున్నామన్నారు. క్రికెట్ సెలక్షన్ కు వచ్చేవారుపూర్తి వివరాలకు 9848882551, 7989134190 నంబర్లకు ఫోన్ చేసి ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈస్ట్ జోన్ తరఫున ఖమ్మం జిల్లాలో జరిగే క్రికెట్ జట్టు ఎంపిక సంబంధించి ఆసక్తి ఉన్నవారు నేరుగా ఓపెన్ సెలక్షన్ లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

**గ్రామీణ ప్రాంత క్రికెటర్లకు పెద్దపీట వెయ్యడమే టిసిఏ లక్ష్యం**

2025 తెలంగాణ గోల్డ్ కప్ ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని జిల్లాలు అన్ని మండలాలను కలుపుకొని ఒక రూరల్ క్రికెట్ ని డెవలప్ చేయడం చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ గోల్డ్ కప్ 2025 నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ గతంలో దుర్వినియోగానికి పాల్పడి చేసిన తప్పులన్నీ కూడా రుజువై ఈరోజు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు అందరూ కూడా జైల్లో ఉన్నారని వారు తెలిపారు. హెచ్ సి ఏ చేసిన అవినీతి మనందరికీ తెలిసిందే అని తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఒక ఛాలెంజ్ గా తీసుకుందని, నిజాయితీగా నిక్కచ్చిగా పనిచేద్దామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో ప్రతి జిల్లాలో క్రికెట్ ని అభివృద్ధి చేయాలనేది తెలంగాణ క్రికెట్ అసోసి యేషన్ లక్ష్యం అన్నారు. తెలంగాణ గోల్డ్ కప్ నవంబర్ ఆఖరివారం నుంచి డిసెంబర్ వరకు ఉంటుం దన్నారు. కాగా ఖమ్మం జిల్లా క్రికెటర్లకు మొండి చేయి చూపిన హెచ్ సి ఏ గత 30, 35 సంవత్స రాలుగా జిల్లా క్రికెట్ దుస్థితి ఏంటో అనేది మనందరం కూడా చూసాము.. ఇందులో చాలామంది క్రికెట్ కోసం వాళ్ళ జీవితాల్ని కూడా త్యాగాలు చేసి అటు ఇటు గాని సిచువేషన్ లో ఉన్నారు, టాలెంట్ ని డెవలప్ చేయాలంటే వాళ్ళ టాలెంట్ బయటకు తీసుకురావాలని



డా. ప్రదీప్ కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లా క్రికెట్ కి ఒక మంచి పేరు తీసుకురావాలి అనే ఒకే ఒక్క ఉద్దేశం తో కమిటీ ఫామ్ చేయడం జరిగింది. ఇంతకుముందు ఎప్పుడు లేని విధంగా ఈ సెలక్షన్స్ ఉండబోతోందని వారు తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ క్రికెటర్ల పాలిట చీడపురుగులా మారిందని, ఎన్నో ఆశలతో క్రికెట్ కోసం త్యాగం చేసిన వారికి అన్యాయం చేసిందని తెలంగాణ క్రికెట్ అసోసి యేషన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు అన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసి యేషన్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు పోటీగా వచ్చినటువంటి వ్యవస్థ కాదు.. 1986 లోనే పాలవాయి గోవర్ధన్ రెడ్డి గారు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ స్థాపించడం జరిగిందని నరేష్ మోహన్ తెలిపారు. 2014లోనే బీసీసీ ఆమోదంతో ఇది ముందుకెళ్ళిందని అన్నారు. గతంలో హె చ్ సి ఏ అన్యాయాలు, అక్రమాలు అరాచకాలు దృష్టిలో ఉంచుకొని తెలంగాణ గ్రామీణ క్రీడాభివృద్ధి కోసం ప్రతి జిల్లాలో కూడా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ తరపున కమిటీ వేసి ఆ కమిటీ ద్వారా సెలక్షన్ చేయాలని ఒక ఉద్దేశాన్ని ముందుకు తీసుకు వచ్చినట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం వచ్చినటువంటి 30 లక్షల రూపాయల్లో సదుపాయాలు కాకుండా ఈ డబ్బులు దుర్వినియోగం చేసి ఎంతోమంది క్రీడాకారుల భవిష్యత్తుని నాశనం చేసి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తీరని అన్యాయం చేసిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెటర్ అసోసియేషన్ కోశాధికారి వీర్ల రవికుమార్ ఉపాధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు జాయింట్ సెక్రెటరీ వీడిఐ రాజీవ్ రాజ్ క్రికెటర్లు ఎండి ఇర్షాద్ రాజశేఖర్ వెంకట్ ఫణి ఖయ్యూం రాధిక, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

## ○విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వెంటనే స్పందించాలి

## ○విద్యుత్ శాఖ జోనల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి



**కొండమల్లేపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి):** రైతుల వ్యవసాయానికి, ఇంటి అవసరాలకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ జోనల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయి కృప ఫంక్షన్ హాల్ లో దేవరకొండ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఈ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలకు నిలిచిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవి కాలంలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రాణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు విద్యుత్ శాఖలో అలసత్వం వహించరాదని విద్యుత్ శాఖలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వినియోగదారులు బిల్లులు సక్రమంగా చెల్లించే విధంగా రోజువారి కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం జరిగితే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమిష్టి కృషితో విద్యుత్ బకాయిలు లేకుండా చూడాలన్నారు. గ్రామాలలో తండాలలో పురాతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాయో పరిశీలించి అవసరమైన చోట నూతన ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులు ఏ అర్ధరాత్రికి విద్యుత్ సమస్యలపై అడిగిన వెంటనే స్పందించి తగిన సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్ శాఖలో ఎవరైనా అలసత్వం వహిస్తే వెంటనే విధుల నుండి బహిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ అంటే అంత ఆషామాశి కాదని నిరంతరం విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు వినియోగదారుల నుండి వసూళ్లకు పాల్పడితే ఉద్యోగాల నుండి బహిష్కరణ తప్పదు అన్నారు.స్థానిక విద్యుత్ ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూసేందుకు మార్గదర్శకాలు ఇచ్చి ప్రమాదాల నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు, ప్రజల ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిఈ విద్యాసాగర్, ఏడిఈలు సైదులు, సాగర్ రెడ్డి, జేఎల్ఎంలు, ఏఎల్ఎంలు, ఏఈలు, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

